క్లుప్తంగా

రెండు మేకల అపహరణ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని మీర్జాపురంలో నర్సుపల్లె కంబయ్యకు చెందిన రెండు మేకలు గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఇంట్లో కట్టేసి ఉండగా దొంగలు తాళ్లను కట్ చేసి మేకలను తీసుకెళ్లారు. రెండు మేకల విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

డోన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పట్టణానికి నీటి సరఫరా చేసే పైప్‌లైన్ దెబ్బతినడంతో గురువారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు. ఈ ప్రాంతంలో తరచుగా పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథా పోతోందని ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో కొత్త పైప్‌లైన్‌లను వేయించినట్లు తెలిపారు. ఆయన వెంట వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ ఉన్నారు.

సీహెచ్‌సీలో మెరుగైన సేవలు

అవుకు: సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. గురువారం స్థానిక సీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్‌ని అడిగి తెలుసుకున్నారు.

సాయిబాబా ఆలయానికి రూ.1.15 లక్షల విరాళం


దాతలకు రశీదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

డోన్ టౌన్: పట్టణ సమీపంలో నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా ఆలయానికి కోట్లవారిపల్లె ఇండస్ట్రియల్ ఏరియాలోని పౌడర్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం రూ.1,15,116 విరాళాన్ని అందజేసింది. గురువారం నిర్మాణంలో ఉన్న గుడి వద్ద కమిటీ సభ్యులు ధర్మారం సుబ్బారెడ్డి, శ్రీను, కందుకూరు పార్థ, కొండా సురేష్, అలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములను కలిసి అందజేశారు. ఫ్యాక్టరీ యజమానులు చంద్రశేఖర్‌రెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, మిట్టా రవి, చెన్నయ్య, ధర్మారం రఘురెడ్డి, అనుముల సుబ్బారెడ్డి, అన్వర్ పాల్గొన్నారు.

10న బండలాగుడు పోటీలు

డోన్: ప్యాపిలి మండల పరిధిలోని పీఆర్ పల్లిలో ఈ నెల 10వ తేదీ బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పంచలింగేశ్వరస్వామి దేవాలయంలో 108వ ఏకాదశి సందర్భంగా నాలుగు పళ్ల విభాగానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు వరుసగా రూ. 30 వేలు, రూ.20 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ. 6 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

జూదరుల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో పేకాట ఆడుతున్న 8 మందిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. గ్రామంలోని ఓ ఇంట్లో బనగానపల్లె, ఉయ్యాలవాడ, శిరివెళ్ల ప్రాంతాలకు చెందిన ఎనిమిది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 37,550 నగదు, ఆరు బైక్‌లు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కొలతలు


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న సంజీవనగర్ కాలనీకి రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గురువారం కొలతలు తీశారు. నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి పనులను పరిశీలించి రైల్వే అధికారులతో మాట్లాడారు. బ్రిడ్జి నిర్మించడం వల్ల కాలనీవాసులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. కాలనీవాసులు రైల్వేట్రాక్ దాటి పట్టణంలోకి రావడానికి ఇబ్బందులు పడేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కోవెలకుంట్ల: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. గురువారం పట్టణ శివారులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్ల వినియోగం అధికం కావడంతో సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల్లోని నగదును ఖాళీ చేస్తున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ, ఆధార్, బ్యాంకు, ఏటీఎం కార్డు, తదితర వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దని సూచించారు. ఆపద సమయంలో 112కు కాల్ చేయాలన్నారు.

మిర్చి.. కన్నీళ్లు మిగిల్చి..!

- భారీగా పడిపోయిన మిర్చి ధరలు
- గిట్టుబాటు ధరలేక రైతుల ఆవేదన
- క్వింటా రూ.8 వేల నుంచి రూ.13 వేలు
- సంజామల మండలంలో 5500 ఎకరాల్లో సాగు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


మిర్చిని కల్లాల్లో ఆరబెడుతున్న రైతులు

సంజామల: రైతులకు మిర్చి ధరలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. మంచి ధరలు ఉంటాయని ఎంతో ఆశగా సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. ధరలు అమాంతం పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. విత్తన దశలో పంట ధరలు అధికంగా ఉండడంతో ఎక్కువ మంది రైతులు మిర్చి పంటపై ఆసక్తి చూపారు. ఒకవైపు ప్రకృతి అనుకూలించక, మరోవైపు వైరస్‌లు ఇబ్బంది పెట్టినా కష్టపడి పంటను కాపాడుకున్నారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కొందరు నష్టాలకు అమ్ముకుంటుండగా మరికొందరు ధరలు పెరుగుతాయనే ఆశతో కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచుకుంటున్నారు. దళారులు సిండికేట్‌గా మారి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

వైరస్‌లతో ఉక్కిరిబిక్కిరి

ఈ ఏడాది వాతావరణం అనుకూలించక ఎర్రనల్లి, థ్రిప్స్, తెల్లదోమ, పచ్చ దోమ, తామర పురుగు తదితర తెగుళ్లు పంటను ఆశించి దెబ్బతీశాయి. తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి పురుగు మందులకు ఎక్కువ వ్యయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దిగుబడులు కూడా తగ్గాయి. గతంలో సిరులు కురిపించిన ఎర్ర బంగారం ఏడాది నుంచి కనీస మద్దతు ధరలేక రైతులను అప్పుల పాలు చేస్తోంది. ఒకేసారి దిగుబడి రావడం ధరల పతనానికి మరో కారణం.

ఆదుకోని ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఏటా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.13,500 అందించేది. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేది. పంటకు గిట్టుబాటు కల్పించేది. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతే పరిహారం అందజేసి ఆదుకునేది. అయితే కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం చేయకుండా చేతులెత్తేసింది. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేసింది. దీంతో రైతులే అప్పులు చేసి పంట సాగు చేశారు.

భారీగా తగ్గిన ధర

ఈ ఏడాది పచ్చిమిర్చి ధర పూర్తిగా తగ్గిపోయింది. రెండేళ్ల నుంచి క్వింటా రూ.22 వేల నుంచి రూ 29 వేల వరకు పలికింది. ఇదే విధంగా ధర ఉంటుందని ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. ఎకరాకు దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు కలుపుకుని రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. క్వింటా ప్రస్తుతం రూ.8 వేల నుంచి రూ. 13 వేల వరకు పలుకుతోంది. ఏం చేయాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు.

వైరస్ సోకి నష్టాలొస్తున్నాయి



మిర్చి పంటకు ఏటా కొత్త రోగాలు వస్తున్నాయి. లక్షలు పెట్టుబడి పెట్టాం. ఈ ఏడాది పంట బాగుంటుందని అనుకున్న తరుణంలో వాతావరణం అనుకూలించక పంట దిగుబడి అరకొరగా వచ్చింది. వైరస్‌తో పంట చాలా వరకు దెబ్బతింది. వచ్చిన పంటకు కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోవాల్సిన పరిస్థితి.
–బోయ భూపాల్, మిర్చి రైతు, ఆకుమల్ల

ధర తగ్గిపోయింది.



ఈ ఏడాది 5 ఎకరాలు మిర్చి పంటను సాగు చేశాను. అనేక రకాల తేగుళ్లను తట్టుకుని మిర్చిని పండించాం. పంట అనుకున్నంత రాలేదు. దిగుబడి తగ్గింది. అటు మిర్చి ధర ఉందా అంటే అది కూడా పతనమైంది. ఆరు నెలల కష్టానికి ప్రతిఫలం లేకుండా పోతోంది. ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించాలి.
–కొటిక శేఖరప్ప, మిర్చి రైతు, ఆకుమల్ల

ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలి



నేను 15 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరాకు సుమారు రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టాను. తెగుళ్లు ఆశించడంతో పురుగు మందులకు ఎక్కువ ఖర్చు చేశాం. వాటి ధరలు కూడా పెరిగాయి. ఈ ఏడాది పెట్టుబడి కూడా వస్తుందో రాదో నమ్మకాలు లేవు. ఏటా పెట్టుబడి పెరుగుతుందే కానీ మద్దతు ధర పెరగడం లేదు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర ప్రకటించాలి.
–గౌరిగారి నాగేశ్వర్‌రెడ్డి, మిర్చి రైతు, ఆకుమల్ల

సస్యరక్షణతో అధిక దిగుబడులు


మామిడి చెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

బేతంచెర్ల: మామిడి, ఉల్లి సాగులో అధిక దిగుబడుల కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆదినారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలో ఉద్యానశాఖ అధికారి రఘువరన్‌తో కలిసి మామిడి, ఉల్లిపంట సాగుపై రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాతావరణంలో వచ్చే మార్పులు, తెగుళ్ల నివారణ, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రాజేశ్వరి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

శ్మశాన దారి సమస్యపై వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సంజామల: పేరుసోముల గ్రామంలో మాదిగల శ్మశాన వాటిక దారిని కాపాడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మిద్దె వెంకటరాముడు గురువారం తహసీల్దార్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు శ్మశాన వాటిక దారిని అక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. కంబగిరి, శ్రీనువాసులు, చిన్న జనాదం ఉన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని పొదుపు భవనంలో యాగంటి క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై ఆలయ ఈఓ చంద్రుడు ఆధ్వర్యంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఈఓ, ఎంపీడీఓ వెంకటరమణ సూచించారు. విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆయా శాఖల అధికారులు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈఈ మద్దిలేటి, ఆర్టీసీ డీఎం రవికిశోర్, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండిమౌలిశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అవగాహన


మాట్లాడుతున్న ఆర్‌ఎంఓ శిరీష

బనగానపల్లె రూరల్: గుండె సంబంధిత వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఆర్‌ఎంఓ డాక్టర్ శిరీష, సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్టెమి ప్రోగ్రాం కింద గుండె వ్యాధిగ్రస్తులకు సుమారు రూ. 45వేల విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇస్తామని తెలిపారు. గుండెపోటు వచ్చిన గంట లోపు బాధితులను వైద్యశాలకు తీసుకురావాలని సూచించారు. ఇంజెక్షన్ స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అందుబాటులో ఉందనే విషయాన్ని వైద్యులు, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గుండె వ్యాధి లక్షణలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు శైలజ, జగదీశ్వరరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, టంగుటూరు, పలుకూరు పీహెచ్‌సీ వైద్యులు సోహెల్‌బాబు, చాణక్య పాల్గొన్నారు.

సంక్షిప్తం

దరఖాస్తుల గడువు పొడిగించాలి

డోన్ టౌన్: బీసీ కార్పొరేషన్ల రుణాల దరఖాస్తు గడువును పొడిగించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. జనవరి 30వ తేదీ నుంచి ఫిబవరి 7వ తేదీ వరకు గడువు విధించారని తెలిపారు. అయితే బీసీ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం జారీలో జాప్యం కారణంగా దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

దళితుల మధ్య చిచ్చుపెట్టొద్దు

బేతంచెర్ల/సంజామల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు దస్తగిరి, సుబ్బారాయుడు రాష్ట్రకార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం బేతంచెర్ల, సంజామలలో కర్నూలులో జరగనున్న రాయలసీమ మాలల యుద్ధగర్జన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

బేతంచెర్ల: గూటుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ, లింగమయ్యస్వామి ఆలయాల్లో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠను పురస్కరించుకుని గురువారం గ్రామంలో విగ్రహాలను ఊరేగించారు. గురవయ్యల డమరుక నాదాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్తుకు విద్యార్థి దశ కీలకం


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు కష్టపడి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. గురువారం స్థానిక మోడల్ స్కూల్‌లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులకు బాల్యవివాహాలు, సెల్‌ఫోన్, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్, భవిష్యత్తులో ఏమవుతావు అనే అంశాలపై వ్యాసరచన, వృకృత్వ పోటీలు నిర్వహించారు. 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుని జీవితంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. తల్లితండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి బాగా చదువుకుని విద్యలో రాణించి వారికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో ఎంతో ప్రతిభ దాగుంటుందని తెలిపారు. తల్లితండ్రులతో పాటు చదువు నేర్పిన గురువులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు, సంఘటనలు జరిగితే నిర్భయంగా 100కు కాల్ చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సీఐని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు చంద్రసేనారెడ్డి, వైవీఎస్ నారాయణరెడ్డి, గుర్రప్ప, మద్దిలేటి, రామకృష్ణారెడ్డి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ


మాత్రలను అందజేస్తున్న డాక్టర్ అశోక్

కోవెలకుంట్ల: జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీలో మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ అశోక్ కోవెలకుంట్ల పట్టణంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చేందుకు మాత్రలను అందజేశారు. నేషనల్ డీవార్మింగ్ డేను పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగు నివారణ మందులు వేస్తామన్నారు. వివిధ కారణాలతో 10వ తేదీ మందులు వేయించుకోని పిల్లలకు తిరిగి ఈ నెల 17వ తేదీ వేస్తామని పేర్కొన్నారు.

దొంగ అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటలో చోరీకి పాల్పడిన ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన బుడత మనోహర్‌ను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. 2024 నవంబర్ 14వ తేదీ కొండపేటలో కె.కుమారి ఇంట్లో చోరీ చేశాడన్నారు. అతని వద్ద నుంచి రూ.1.70 లక్షల విలువైన మూడు తులాల బంగారం, 15 తులాల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇతడిపై బనగానపల్లె టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్ దొంగతనాల కేసు.. అవుకులో ఒక కేసు ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఎంపీపీ సేవలు అభినందనీయం


బుగ్గన నాగభూషణం రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బేతంచెర్ల: మండల అభివృద్ధిలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, సర్పంచ్‌లు శ్రీరాములు, వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శేషారెడ్డి సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం పాల్గొన్నారు.

అందుబాటులో గుండెపోటు ఇంజెక్షన్లు

కోవెలకుంట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండెపోటుకు సంబంధించి స్టెమి ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని సీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం స్టెమి కార్యక్రమంపై రోగులు, ప్రజలకు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన వ్యక్తులకు ఉచితంగా రూ. 45 వేలు విలువ చేసే ఇంజెక్షన్లు వేయడం జరుగుతుందన్నారు. గుండెపోటు వచ్చే ముందు ఛాతిలో నొప్పి, ఎడమ చేయి లాగినట్లుగా ఉండడం, ఆయాసం, తదితర లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు కన్పిస్తే గంటలోపు ఆస్పత్రిలో చేర్చాలన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి


మాజీ ఎమ్మెల్యే కాటసానిని సన్మానిస్తున్న నాయకులు

బనగానపల్లెరూరల్:వైఎస్సార్‌సీపీ బనగానపల్లె నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన తళ్లం సుబ్రమణ్యం గురువారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి ఉన్నారు.

వేసవిలో తాగునీటి సమస్యలు రానీయొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి

బేతంచెర్ల: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం బేతంచెర్ల ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో డోన్ ఆర్డీఓ నరసింహులుతో కలిసి గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు అందించే వాటర్ గ్రిడ్ పథకం, ఓర్వకల్లు మండలం నుంచి బేతంచెర్ల మండలం మీదుగా డోన్ వరకు జరుగుతున్న 340 (బీ) జాతీయ రహదారి నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్‌లు ప్రకాశ్‌బాబు, నాగమణి, భారతి, మున్సిపల్ కమిషనర్లు ప్రసాద్‌గౌడు, హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ కుమార్ రెడ్డి, ఏఈ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ తిమ్మరుసునాయుడు

బనగానపల్లె రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని నంద్యాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తిమ్మరుసు నాయుడు అన్నారు. రోడ్డు భద్రతా మాత్సవాల్లో భాగంగా గురువారం యనకండ్ల గ్రామంలోని మై హోమ్ గ్రూప్ సిమెంట్ పరిశ్రమలో డ్రైవర్లు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. వాహన డ్రైవర్లు తప్పనిసరిగా బీమాతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రెడ్డి, బనగానపల్లె అర్బన్ సీఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

డోన్: డ్రైవింగ్ సమయంలో కనురెప్ప పాటు నిర్లక్ష్యం అనేక మంది ప్రాణాలను బలిగొంటుందని డోన్ ఎంవీఐ క్రాంతికుమార్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ ప్రాధాన్యత, హెల్మెట్ వినియోగం, ప్రయోజనాలు, ట్రిపుల్ రైడింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, అతి వేగం వల్ల కష్టనష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ భారతి పాల్గొన్నారు.

ఉల్లిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఉద్యానవన ఏడీఏ కళ్యాణి

డోన్: ఉల్లి పంటలో నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటిస్తే తెగుళ్లు సోకకుండా నివారించవచ్చని ఉద్యానవనశాఖ ఏడీఏ కళ్యాణి అన్నారు. మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆదినారాయణ ఆధ్వర్యంలో ఉల్లి రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తామర పురుగులు ఉల్లిపంటకు సోకకుండా ఇమిడాక్లోప్రిడ్ లీటర్ నీటికి 5 మిల్లీలీటర్లు, ఫిప్రోనిల్ లీటర్ నీటికి 2 మిల్లీలీటర్లు వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు లీటర్ నీటికి సాఫ్ 2.5 గ్రాములు లేదా లీటర్ నీటిలో కాబ్రియోటాప్ 3 గ్రాములు, లేదా లీటర్ నీటిలో నాటివో 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకులు చుట్టుకునే తెగులు నివారణకు లీటర్ నీటికి బోరాన్ 3 గ్రాములు కలిపి ఉల్లిపంటపై పిచికారీ చేస్తే క్రిములు, కీటకాలు నశించి గడ్డ ఏపుగా పెరిగి రైతులకు లాభిస్తుందన్నారు.

ఎంఅండ్‌ఎం మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సోదాలు


రికార్డులను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాసీంవలి, వెంకటరాముడు

బనగానపల్లె రూరల్: స్థానిక నంద్యాల రోడ్డులోని ఎంఅండ్‌ఎం మార్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఫుడ్ సేఫ్టీ, రెవెన్యూ అధికారులు సోదాలు నిర్వహించారు. పాలిస్ చేసిన పీడీఎస్ బియ్యంతో పాటు అనుమతులులేకుండా నిత్యావసర వస్తువులు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారనే సమాచారంతో బుధవారం రాత్రి రెవెన్యూ అధికారులు సోదలు చేయగా గురువారం డిప్యూటీ సివిల్ సప్లయి అధికారి నాగేశ్వర రెడ్డి ఎంఅండ్‌ఎం మార్ట్ వద్దకు చేరుకుని లారీలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యం ప్యాకెట్లతో పాటు కందిపప్పు, మినుపప్పు, వేరుశనగ పప్పు తదితర నిత్యావసర సరకుల ప్యాకెట్లను సీజ్ చేశారు. మధ్యాహ్నం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఖాసీంవలి, వెంకటరాముడలతోపాటు సివిల్ సప్లయి అధికారి నాగేశ్వరరెడ్డి మార్ట్ వద్దకు వచ్చి బియ్యం ఇతర వస్తువులను పరిశీలించి వాటి శాంపిల్స్ సేకరించారు. సివిల్ సప్లయి అధికారి నాగేశ్వరరెడ్డి మార్ట్ వారికి బియ్యం సరఫరా చేసిన రైస్ మిల్లు వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. మార్ట్ సుమారు 330 క్వింటాళ్ల బియ్యం, నాలుగు టన్నుల వేరుశనగ, 1.7 టన్నుల కందిపప్పు, 1.5 టన్నుల మినుపప్పు సరకులు ఉన్నట్లు సివిల్ సప్లయి డీటీ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మార్ట్ కడప జిల్లా రాజంపేటకు చెందిన మునిరెడ్డి, నారాయణరెడ్డిలకు చెందినదిగా నిర్వాహకులు డీటీకి వివరించారు. ప్రభుత్వ అనుమతులు చూపించకపోవడంతో గోడౌన్‌లోని వస్తువులను సీజ్ చేసి రిపోర్టును జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందజేయనున్నట్లు సివిల్ సప్లయి డీటీ తెలిపారు.